సాక్షి
చిత్తూరు
ఆదివారం । 17 । డిసెంబర్ । 2023



కాణిపాకంలో రద్దీ

వరసిద్ధి వినాయక స్వామివారి ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. శనివారం సెలవు కావడంతో భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. - 8లో



దివ్యాంగుల అభ్యున్నతికి కృషి

ప్రస్తుత ప్రభుత్వం దివ్యాంగుల అభ్యున్నతికి విశేష కృషి చేసిందని జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు అన్నారు. - 8లో



ద్విచక్ర వాహనాల ఢీ.. ఇద్దరి మృతి

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొని ఇద్దరు మృతి చెందగా, మరొకరు గాయపడిన సంఘటన తంబిగానిపల్లె వద్ద జరిగింది. - 8లో

న్యూస్‌రీల్

జిల్లా ఎస్పీకి డిస్క్ అవార్డు



డీజీపీతో కరచాలనం చేస్తున్న ఎస్పీ రిశాంత్‌రెడ్డి

చిత్తూరు అర్బన్: జిల్లా ఎస్పీ రిశాంత్‌రెడ్డికి ప్రతిష్టాత్మకమైన డీజీపీ డిస్క్ కమెండేషన్ అవార్డు వరించింది. ఈ అవార్డును మంగళగిరిలో శనివారం రాష్ట్ర డీజీపీ చేతుల మీదుగా అందుకున్నారు. మహిళలు, పిల్లల భద్రత కోసం ప్రతి గడపకు పోలీస్ యాప్‌ను తీసుకెళ్లడం, ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానం, సారా నిర్మూలన, కేసుల పరిష్కారం తదితర అంశాల ఆధారంగా ఎస్పీ అవార్డును సొంతం చేసుకున్నారు.

సమ్మె విరమించుకోండి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు సమ్మె విరమించుకోవాలని కలెక్టర్ షణ్మోహన్ కోరారు. అంగన్‌వాడీ కార్యకర్తలు చేస్తున్న సమ్మెలో పేర్కొన్న డిమాండ్లల్లో ముఖ్యమైన 5 డిమాండ్లను తీర్చడానికి ప్రభుత్వం అంగీకరించినట్లు పేర్కొన్నారు. మిగిలిన డిమాండ్లను రాష్ట్రస్థాయిలో సోమ, మంగళవారాల్లో జరిగే చర్చల్లో చర్చిస్తారన్నారు. సమ్మెలో ఉన్న అంగన్‌వాడీ సిబ్బంది సమ్మె విరమించుకుకోవాలన్నారు.



అభివాదం చేస్తున్న ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యే వెంకటే గౌడ



పలమనేరులో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు తరలివచ్చిన అశేషజనవాహిని



బస్సుయాత్రలో ప్రజలకు అభివాదం చేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

సామాజిక నీరాజనం

పట్టుసీమ జనసీమగా మారింది. టవర్‌క్లాక్ కూడలి జనసంద్రమైంది. వైఎస్సార్‌సీపీ చేపట్టిన సామాజిక సాధికార బస్సుయాత్రకు దారిపొడవునా అపూర్వ స్వాగతం లభించింది. సంక్షేమ ఫలాలు పొందినవారంతా స్వచ్ఛందంగా తరలివచ్చి, డిప్యూటీ సీఎంలు, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులకు అడుగడుగునా బ్రహ్మరథం పట్టారు. ప్రజల ఆకాంక్షలకు అద్దం పట్టేలా సాగుతున్న జగనన్న పాలన మళ్లీ కావాలంటూ నినాదాలు చేశారు. బడుగు వర్గాలకు ప్రభుత్వం చేసిన మంచిని వక్తలు వివరిస్తుంటే.. తమ బతుకుల్లో వచ్చిన మార్పును గుర్తు చేసుకుంటూ కరతాళధ్వనులతో కృతజ్ఞతలు తెలిపారు. మొత్తంగా పలమనేరులో జరిగిన బస్సుయాత్రలో సామాజిక సాధికారిత ప్రతిధ్వనించింది.

- వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో ఉత్సాహం నింపిన బస్సుయాత్ర
- వర్షం వచ్చినా కట్టుకదలని జనం
- స్వచ్ఛందంగా తరలివచ్చిన ప్రజలు
- అడుగడుగునా అపూర్వ స్వాగతం

పలమనేరు/చిత్తూరు: పలమనేరులో జరిగిన సామాజిక, సాధికార బస్సుయాత్రకు నియోజక వర్గం నలువైపుల నుంచి జనం భారీగా తరలివచ్చారు. ఈ కార్యక్రమానికి హాజరైన మంత్రులు, స్థానిక నేతలు తొలుత గంగవరం పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం వైఎస్సార్ విగ్రహాన్ని ఆవిష్కరించి నివాళులర్పించారు. ఆ తరువాత గంగవరం నుంచి వేలాది మందితో భారీ ర్యాలీ నిర్వహించారు. సామాజిక సాధికార బస్సుయాత్ర సందర్భంగా పలమనేరులోని టవర్‌క్లాక్ వద్ద ఎమ్మెల్యే వెంకటేగౌడ అధ్యక్షతన సభ నిర్వహించారు. సభలో డిప్యూటీ సీఎంలు అంజాద్ బాషా, నారాయణస్వామి, మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, గుమ్మనూరు జయరామ్, పార్లమెంటు సభ్యుడు ఎన్ రెడ్డెప్ప, నెల్లూరు ఎమ్మెల్యే అనిల్‌కుమార్ యాదవ్, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్సీలు భరత్, రమేష్ యాదవ్, డీసీసీబీ చైర్‌పర్సన్ మొగసాల రెడ్డెమ్మ తదితరులు పాల్గొన్నారు.

మైనారిటీలకు పెద్దపీట

డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా మాట్లాడుతూ మైనారిటీలకు పెద్దపీట వేసింది జగనన్న ప్రభుత్వంలోనే అన్నారు. మరో డిప్యూటీ సీఎం నారాయణస్వామి మాట్లాడుతూ రాష్ట్రంలో ఎంత మంచి జరుగుతున్నా చంద్రబాబు, పచ్చమీడియాకు కనిపించడం లేదన్నారు. 'నా తలరాతను నా తల్లిదండ్రులు, బ్రహ్మ కూడా మార్చలేదు. ఓ బీసీకి మంత్రి పదవి ఇచ్చి, నా రాతను మార్చింది జగనన్నే'. అని మంత్రి గుమ్మనూరు జయరామ్ పేర్కొన్నారు. మాజీ మంత్రి, నెల్లూరు ఎమ్మెల్యే అనిల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో బడుగు, బలహీనవర్గాల సునామీ కొనసాగుతోందని, బీసీలకు సగం పదవులిచ్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. నీతిలేని వ్యక్తులే సీఎంను విమర్శిస్తున్నారని ఎంపీ రెడ్డెప్ప తెలిపారు.

పలమనేరులో రూ.2,200 కోట్లతో అభివృద్ధి

ఒక పలమనేరులోనే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.2,200 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టిందని నేతలు తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలు గుర్తించాలని చెప్పారు.



బస్సుయాత్రలో వాహనాల కాన్వాయ్

వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో సమరోత్సాహం

పలమనేరులో జరిగిన సామాజిక, సాధికార బస్సుయాత్ర నియోజకవర్గంలోని పార్టీ శ్రేణుల్లో జోష్‌ను నింపింది. అన్ని మండలాల నుంచి స్వచ్ఛందంగా జనం 25 వేల మందికి పైగా బస్సుయాత్రకు హాజరయ్యారు. మరో ఐదువేల మంది స్థలం లేక చుట్టుపక్కలు ఉండాల్సి వచ్చింది. భారీ ర్యాలీ విజయవంతమైంది. వర్షం కాసేపు అడ్డంకిగా మారిన జనం కట్టుకదలకుండా విజయవంతం చేశారు. సభను విజయవంతం చేసిన ప్రజలకు స్థానిక ఎమ్మెల్యే వెంకటేగౌడ కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర కార్యదర్శులు కృష్ణమూర్తి, మురళీకృష్ణ, మున్సిపల్ చైర్‌పర్సన్ చాముండేశ్వరి, ఏఎంసీ చైర్మన్ హేమంత్‌కుమార్ రెడ్డి, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు పోకల అశోక్‌కుమార్, అశ్వర్థనాయక్ పాల్గొన్నారు.



అభిమానుల కోలాహలం

సంక్షేమం..అభివృద్ధికి కేరాఫ్ జగన్

- జగనన్నే మళ్లీ ముఖ్యమంత్రి కావాలి
- మంత్రి ఆర్కే రోజా

నింద్ర: రాష్ట్రంలో సంక్షేమానికి, అభివృద్ధికి కేరాఫ్ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి ఆర్కే రోజా అన్నారు. నింద్ర మండలం కొప్పెడు దళితవాడలో శనివారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ ముఖ్యమంత్రి అమలు చేయనన్ని పథకాలు ప్రజలకు అందించిన ఘనత జగన్ననకే దక్కుతుందన్నారు. అవ్వాతాతలు, విద్యార్థులు అందరికీ పథకాలు అమలు చేసి, వారిని ఆదుకున్న నాయకుడు జగన్‌మోహన్ రెడ్డి ఒక్కరే అన్నారు. ప్రజలకు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేసిన ప్రభుత్వం మన జగనన్న ప్రభుత్వమే అని చెప్పారు. నవరత్నాల పేరుతో పలు సంక్షేమ పథకాలు అమలు చేసి ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. అవ్వాతాతలకు జనవరి నుంచి పింఛన్ రూ.3 వేలు వస్తుందని చెప్పారు. ఆరోగ్యశ్రీ పథకం ఇప్పుడు రూ.25 లక్షలు వరకు పెంచి, పలు వ్యాధులకు వర్తింపజేశారని తెలిపారు. కొప్పెడు సచివాలయ పరిధిలో అభివృద్ధి, సంక్షేమం జరిందని. దీన్ని అంకెలతో ప్రత్యక్షంగా చూపుతున్నామన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి పథకాలు ప్రజలు తెలుసుకునేందుకే డిస్‌ప్లే బోర్డులు ఆవిష్కరిస్తున్నట్లు మంత్రి చెప్పారు. గత ప్రభుత్వ పాలనలో ఇలాంటి పనులు ఏమైనా జరిగాయా? అని ప్రజలు ఆత్మపరిశీలన చేసుకోవాలన్నారు. కుల, మత పార్టీలకతీతంగా ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాలు అందించిన జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. సాధికారత సీఎం జగన్‌తోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దీప, ఎంపీడీఓ అరుణ, వైస్ ఎంపీపీ శుభ, మండల కోఆప్షన్ సభ్యుడు అనిల్, ఎంపీటీసీ సభ్యుడు విజేష్, ఎంపీటీసీ మాజీ సభ్యురాలు చెంచమ్మ, సింగిల్ విండో అధ్యక్షుడు మునికృష్ణారెడ్డి, సచివాలయ కన్వీనర్ బాబురెడ్డి, పార్టీ మండల కన్వీనర్ వేణురాజు, నాయకులు రామచంద్రరెడ్డి, సునీల్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



కొప్పెడులో లబ్ధిదారుకు బుక్‌లెట్ అందజేస్తున్న మంత్రి రోజా

పరీక్షలపై దృష్టి పెట్టండి

పూతలపట్టు: పదో తరగతి పబ్లిక్ పరీక్షపై విద్యార్థులు దృష్టి పెట్టాలని డీఈఓ విజయేంద్రరావు అన్నారు. శనివారం ఆయన పూతలపట్టు జెడ్పీ హైస్కూలును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా సమ్మెటివ్-1 పరీక్షల్లో ఉతీర్ణత సాధించిన పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. కష్టపడి చదివి పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులు తెచ్చుకుని పాఠశాలకు మంచి పేరు తేవాలని సూచించారు. పరీక్షలకు తక్కువ సమయం ఉండడంతో సమయాన్ని వృథా చేయకుండా చదువుపై దృష్టి సారించాలన్నారు. అనంతరం పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశంలో పాల్గొన్నారు. పరీక్షల సమయంలో పిల్లలను ఉదయం పూట తొందరగా నిద్రలేపి చదివించాలని సూచించారు. పిల్లలకు మొబైల్ ఫోన్లను ఇవ్వడం వీలైనంత మేరకు తగ్గించాలని చెప్పారు. ఖాళీ సమయాల్లో పిల్లలను ఇంటి వద్ద చదివించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని తెలిపారు. ఐరాల ఎంఈఓ దామోదరం నాయుడు, ఇన్‌చార్జి హెచ్‌ఎం విశ్వనాథరెడ్డి, ఉపాధ్యాయులు మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.



సమ్మెటివ్ పరీక్ష పేపరును పరిశీలిస్తున్న డీఈఓ

క్లుప్తంగా

అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు

వెదురుకుప్పం: మండల మీట్‌కు గైర్హాజరైన అధికారులపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు ఎంపీడీఓ ప్రేమ్‌రాజ్‌కుమార్ హెచ్చరించారు. శనివారం వెదురుకుప్పంలో ఎంపీపీ నాగరాణి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రజా సమస్యలు పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని, అయినా వారు మండల సమావేశాలకు రాకుండా కాలయాపన చేయడం మంచి పద్ధతి కాదన్నారు. అగ్రహారంలో 45 రోజులుగా ట్రాన్స్‌ఫార్మర్ పాడైపోయి విద్యుత్ సరఫరా లేక బోరు మోటారు పనిచేయని కారణంగా గ్రామస్తులు తాగునీటి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని నల్లవెంగనపల్లె సర్పంచ్ పుష్ప ధ్వజమెత్తారు. ట్రాన్స్‌కో ఏఈ రామాంజనేయులుకు విద్యుత్ సమస్యలపై ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆరోపించారు. కిచ్చమనాయుడుపల్లెలో ట్రాన్స్‌ఫార్మర్ సకాలంలో మరమ్మతు చర్యలు చేపట్టకపోవడంతో మహిళలు తాగునీటికి వ్యవసాయ బోర్ల వద్దకు పరుగులు తీస్తున్నారని మండిపడ్డారు. జేఎల్ఎం భూపతి సక్రమంగా విధులకు హాజరుకావడం లేదని, గ్రామాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యల గురించి పట్టించుకోవడం లేదని, ఫోన్ చేస్తే నిర్లక్ష్యంగా సమాధానమిస్తున్నారని చెప్పారు. ఎంపీపీ నాగరాణి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవచూపాలన్నారు. అభివృద్ధే ధ్యేయంగా పనిచేసి మండలాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని సూచించారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు సుకుమార్, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల అభ్యున్నతికి కృషి

- ఘనంగా అంతర్జాతీయ విభిన్న ప్రతిభా వంతుల దినోత్సవం
- పాల్గొన్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, నగర మేయర్ అముద, డీఆర్వో రాజశేఖర్


మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : ప్రస్తుత ప్రభుత్వం దివ్యాంగుల అభ్యున్నతికి విశేష కృషి చేసిందని జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ భవనంలో అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ గత ఎన్నికలకు ముందు దివ్యాంగులకు ఇచ్చిన మాట ప్రకారం సీఎం అన్ని హామీలను నెరవేర్చారని చెప్పారు. దివ్యాంగుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. అర్హులైన దివ్యాంగులకు సబ్సిడీ రుణాలు అందిస్తోందని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకంలో దివ్యాంగులకు సమాన ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. జిల్లా కేంద్రంలో విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ భవనం ఏర్పాటుకు కలెక్టర్‌తో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. భవన నిర్మాణానికి జెడ్పీ నిధుల నుంచి రూ.50 లక్షలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. నగర మేయర్ అముద మాట్లాడుతూ టీడీపీ పాలనలో దివ్యాంగులకు అన్యాయం చేశారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వినియోగించుకుని దివ్యాంగులు మనోధైర్యంతో ముందుకెళ్లాలన్నారు. డీఆర్‌ఓ రాజశేఖర్ మాట్లాడుతూ అర్హులైన దివ్యాంగులకు ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు చేరేలా చర్యలు చేపట్టామన్నారు. ఎన్నికల సమయంలో దివ్యాంగులకు ఇబ్బందులు కలగకుండా ర్యాంపులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. జిల్లాలో ప్రభుత్వ నిబంధనలను అనుసరిస్తూ బ్యాక్‌లాగ్ పోస్టుల నియామకాలు పారదర్శకంగా చేపట్టినట్లు తెలిపారు. జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ దివ్యాంగులు చట్టాలు, హక్కులపై అవగాహన పెంచుకోవాలన్నారు. దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక క్యాంపులు నిర్వహించి, ల్యాప్‌టాప్‌లు, ట్రైసైకిళ్లు అందజేసిందని చెప్పారు. జిల్లా విభిన్న ప్రతిభావంతుల శాఖ సంక్షేమ అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని తెలిపారు. జూలై నెలలో దాదాపు రూ.1.5 కోట్ల విలువైన పరికరాలు అందించినట్లు చెప్పారు. ఇందులో 70 ద్విచక్ర వాహనాలు పంపిణీ చేశామన్నారు. దివ్యాంగుల ఎదుగుదలకు అంగవైకల్యం అడ్డుకాకూడదన్నది ప్రభుత్వ ధ్యేయమనన్నారు. అనంతరం వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన దివ్యాంగులకు ప్రశంసాపత్రాలు అందజేశారు.


కార్యక్రమంలో పాల్గొన్న విభిన్నప్రతిభావంతులు, అధికారులు

వందశాతం ఫలితాలే లక్ష్యం


పాలకల హైస్కూల్‌లో ఎస్-1 పరీక్షల్లో మెరిట్ సాధించిన విద్యార్థులతో డీఈఓ విజయేంద్రరావు

ఐరాల: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు డిజిటల్ బోధనతో విద్యావ్యవస్థలో ప్రభుత్వం విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిందని డీఈఓ విజయేంద్రరావు అన్నారు. మండలంలోని పాలకల, నాంపల్లె, పుత్రమద్ది జెడ్పీ హైస్కూళ్లను శనివారం ఆయన సందర్శించారు. పాలకలలో పదో తరగతి విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను పరిశీలించారు. ఎస్-1 పరీక్షల్లో ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులను అభినందించారు. పుత్రమద్ది హైస్కూల్‌లో సైన్స్ ఎగ్జిబిషన్‌ను పరిశీలించి, నమూనాలకు సంబంధించిన అంశాలపై విద్యార్థులతో చర్చించారు. ఎంఈఓలు రుషేంద్రబాబు, దామోదర్‌నాయుడు, హెచ్ఎంలు శాంతకుమారి, హరిబాబు, హేమచంద్రరెడ్డి పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీ.. ఇద్దరి మృతి

- మరో యువకుడి పరిస్థితి విషమం


అభిషేక్(ఫైల్)


ప్రవీణ్ (ఫైల్)

కుప్పం రూరల్: ఎదురు ఎదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొని ఇద్దరు యువకులు దుర్మరణం చెందగా, మరో యువకుడు తీవ్రంగా గాయపడిన సంఘటన శనివారం కుప్పం మండలం తంబిగానిపల్లె వద్ద చోటు చేసుకుంది. కుప్పం పోలీసుల కథనం మేరకు.. కుప్పం మండలం తొట్లిమ్మగుడి గ్రామానికి చెందిన అభిషేక్ (22) తన ద్విచక్ర వాహనంలో కుప్పం వైపు బయలుదేరాడు. పెద్దబంగారునత్తం గ్రామానికి చెందిన ప్రవీణ్ (18) తన స్నేహితుడు నితీష్‌తో కలిసి కుప్పంలో పనులు ముగించుకుని, స్వగ్రామానికి పయనమయ్యారు. వీరిద్దరు తంబిగానిపల్లె వద్ద వేగంగా వస్తూ ఎదురు ఎదురుగా ఢీ కొన్నారు. ప్రమాదంలో అభిషేక్, ప్రవీణ్ అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన నితీష్‌ను స్థానికులు కుప్పం పీఈఎస్ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న కుప్పం పోలీసులు యువకుల మృతదేహాలను ఏరియా ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

శోకసంద్రంలో తొట్లిమ్మగుడి, పెద్దబంగారునత్తం

శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో తొట్లిమ్మ గుడికి చెందిన యువకుడు అభిషేక్, పెద్దబంగారునత్తం గ్రామానికి చెందిన ప్రవీణ్ మృతి చెందడంతో ఆ రెండు గ్రామాల్లో విషాధచాయలు అలుముకున్నాయి. శనివారం మధ్యాహ్నం వరకు తమ ముందు ఆనందం గడిపిన యువకులు సాయంత్రానికి లేరన్న విషయం తెలియడంతో గ్రామస్తులందరూ కంట తడి పెట్టుకున్నారు.

కాణిపాకంలో రద్దీ


క్యూలో వేచి ఉన్న భక్తులు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామివారి ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. శనివారం సెలవు దినం కావడంతో ఉదయం నుంచి అయ్యప్ప భక్తులు, సాధారణ భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో స్వామివారి క్యూలన్నీ నిండిపోయాయి. దీంతో భక్తులు ఆలయం వెలుపల వరకు బారులు తీరారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆలయాధికారులు తగు చర్యలు తీసుకుని భక్తులకు దర్శన ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయాధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ దృష్టికి టీచర్ల సమస్యలు


ఎమ్మెల్సీకి పుష్పగుచ్ఛం ఇస్తున్న టీచర్లు

చిత్తూరు కలెక్టరేట్ : టీచర్ల సమస్యలను పరిష్కరించాలని పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు గిరిప్రసాద్ రెడ్డి కోరారు. శనివారం చిత్తూరుకు విచ్చేసిన ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి పీఆర్‌టీయూ సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. గిరిప్రసాద్‌రెడ్డి ఎమ్మెల్సీతో మాట్లాడుతూ మున్సిపల్ స్కూళ్లలో పనిచేస్తున్న ఎల్‌పీ తెలుగు, పీఈటీల అప్‌గ్రేడేషన్ సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. అనంతరం పలు అంశాలపై వారు ఎమ్మెల్సీతో చర్చించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వేణు, ఏకాంబరరెడ్డి, వెంకటేశ్వర్‌లు, శారద, శైలజ, కృష్ణమూర్తి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంటలపై ఏనుగుల దాడి

పెద్దపంజాణి: పేటూరు ఫారెస్టు బీటు నుంచి వచ్చిన ఏనుగులు పెద్దకాప్పల్లి పంచాయతీ పరిధిలోని పెనుగొలకల గ్రామానికి చెందిన ఈశ్వరమ్మ తదితరులు సాగు చేసిన వరి పంటను తొక్కి నాశనం చేశాయి. శనివారం ఉదయం పొలాల వద్దకు వెళ్లిన రైతులు పంటలు ధ్వంసమై ఉండడాన్ని గుర్తించారు. ఏనుగుల దాడుల్లో చేతికొచ్చిన పంటను నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఒంటరి ఏనుగు హల్‌చల్

– ఏనుగు దాడిలో గాయపడ్డ రైతు


గాయపడిన ఆవులప్ప

కుప్పంరూరల్: మండలంలోని నూలుకుంట, గరిగచీనేపల్లె గ్రామాల్లో శనివారం రాత్రి ఒంటరి ఏనుగు హల్‌చల్ చేసింది. గుంపు నుంచి తప్పించుకుని వచ్చిన ఒంటరి ఏనుగు రామకుప్పం నుంచి కుప్పం మండలం వైపు దూసుకొచ్చింది. శనివారం రాత్రి నూలుకుంట, గరిగచీనేపల్లి గ్రామాల మధ్య ఉంటూ స్థానికులను భయాందోళనలకు గురిచేసింది. శనివారం రాత్రి 7 గంటల ప్రాంతంలో పొలాల వద్ద ఇల్లు కట్టుకుని నివాసం ఉన్న నూలుకుంట గ్రామానికి చెందిన ఆవులప్పపై ఒంటరి ఏనుగు దాడికి దిగింది. కుటుంబ సభ్యుల సహకారంతో ఆవులప్ప ఏనుగు బారినుంచి తప్పించుకున్నాడు. కుటుంబ సభ్యులు గాయపడ్డ ఆవులప్పను కుప్పం పీఈఎస్ ఆస్పత్రికి తరలించి చికిత్సలు చేయిస్తున్నారు. కుప్పం అటవీ శాఖ అధికారులు ఒంటరి ఏనుగును తమిళనాడు అటవీ ప్రాంతం వైపు తరలించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

అనుమానాస్పదస్థితిలో ఆశ కార్యకర్త మృతి

కుప్పంరూరల్: అనుమానాస్పదస్థితిలో ఆశా కార్యకర్త మృతి చెందిన సంఘటన శనివారం కుప్పం పట్టణంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. కుప్పం మండలం బేవనపల్లెకు చెందిన ఆశా కార్యకర్త చైతన్య (38) ఆశా కార్యకర్తగా పనిచేయడంతోపాటు పలు ఇళ్లలో పనులు చేసుకుని జీవనం సాగించేది. ఈ క్రమంలో చైతన్య పట్టణంలోని రామచంద్రరోడ్డులోని ఓ ఇంట్లో పనుల కోసం వచ్చింది. ఏమి జరిగిందో తెలియదు గానీ శనివారం మధ్యాహ్న సమయంలో చైతన్య ఆ ఇంట్లో పైకప్పుకుని ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు చైతన్య మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం కుప్పం ఏరియా ఆస్పత్రికి తరలించారు. భర్త మునెప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ రామకృష్ణ చెప్పారు. ఆమె బేవవనపల్లె నుంచి కుప్పం వచ్చి మరణించడమేమిటని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఆమె ఆత్మహత్య చేసుకుందా? లేక హత్య జరిగిందా? అన్న అనుమానం వెలిబుచ్చుతున్నారు.

19న స్మార్ట్ ఇండియా హ్యాక్‌థాన్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న ఎస్వీసెట్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 19వ తేదీన స్మార్ట్ ఇండియా హ్యాక్‌థాన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆ కళాశాల వైస్ చాన్సలర్ ఆర్‌వీ శ్రీనివాస్ వెల్లడించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ప్రాచుర్యం పొందిన ఈ కార్యక్రమం నిర్వహణకు తమ కళాశాల వేదిక కావడం శుభపరిణామమని తెలిపారు. మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్ ఇనోవేషన్(ఎంఐసీ) ఆధ్వర్యంలో ఈ నెల 19, 20 తేదీల్లో స్మార్ట్ ఇండియా హ్యాక్‌థాన్ 2023 గ్రాండ్ ఫినాలే కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి జాతీయ స్థాయిలోని వివిధ కళాశాలల నుంచి ఇంజినీరింగ్ విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే విద్యార్థులతో ఈ నెల 19 ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్ పద్ధతిలో మాట్లాడుతారన్నారు. విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీసేందుకు కొత్త ప్రాజెక్టులను ఆవిష్కరించేందుకు ఈ పోటీలు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి పోటీలకు విద్యార్థులు హాజరవుతుండడంతో అన్ని ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే విద్యార్థులు గెలుపోటములు సమానంగా తీసుకోవాలన్నారు. పోటీతత్వాన్ని అలవరుచుకోవాలని సూచించారు. ప్రిన్సిపల్ మోహన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.